అభివృద్ధికి చిరునామా 47వ డివిజన్

- రూ.80 లక్షలతో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం
- కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణం
- నాలుగు దేవాలయాల పునర్నిర్మాణం
- కొండ ప్రాంతంలో మెట్లు, డ్రెయిన్లు, రిటైనింగ్‌వాల్స్


47వ డివిజన్‌లోని వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గం చిట్టినగర్ ప్రాంతంలోని 47వ డివిజన్ అభివృద్ధికి చిరునామాగా మారింది. గత ప్రభుత్వ హయాంలో స్థానిక ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యానికి గురైన ఈ డివిజన్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి ఒక వైపు అభివృద్ధి మరోక వైపు సంక్షేమం దిశగా పరుగులు పెడుతోంది. డివిజన్‌లోని సమస్యల గురించి అప్పటి టీడీపీ పాలకులను అడిగి అడిగి విసిగి పోయాం తప్ప ఒక్క సమస్య పరిష్కారానికి నోచుకోలేదని స్థానికులు చెబుతున్నారు. సీఎం జగన్ ప్రభుత్వ పాలనలో పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, స్థానిక కార్పొరేటర్ గోదావరి గంగ జవాబుదారీతనంగా ఉంటూ ఏ సమస్య చెప్పినా సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేవారని గుర్తు చేస్తున్నారు. తద్వారా మంచి వ్యక్తులను ఎన్నుకున్నామన్న సంతృప్తి కలుగుతుందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలు ఎక్కువగా నివసించే ఈ డివిజన్‌లో వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని (యుపీహెచ్‌సీ) నిర్మించినందున ప్రైవేట్ హాస్పటల్స్‌కు వెళ్లి వైద్యం చేయించుకోవాల్సిన బాధ తప్పిందని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు డివిజన్ ప్రజలు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కేవలం సంక్షేమమే తప్ప అభివృద్ధి లేదనే ప్రతిపక్ష నాయకులు విమర్శలను డివిజన్ ప్రజలు కొట్టిపారేస్తున్నారు. గత ప్రభుత్వంలో జరగని అభివృద్ధి జగన్ ప్రభుత్వ పాలనలో స్పష్టంగా, ప్రత్యక్షంగా కనబడుతుంది. కాదని ఎవరైనా అంటున్నారంటే అది ప్రభుత్వంపై బురద చల్లటమేనని వ్యాఖ్యానిస్తున్నారు. చంద్రబాబు తన పాలనలో ప్రజలను మభ్యపెట్టి మసిపూసి మారేడు కాయచేసిన ఘనుడని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది చేతల ప్రభుత్వమని జరిగిన/జరుగుతున్న అభివృద్ధి చూస్తే స్పష్టంగా అర్థమవుతుందని చెబుతున్నారు.

దేవాలయాల పునర్నిర్మాణం...

డివిజన్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న పురాతన దేవాలయాల స్థానంలో సుమారు కోటి రూపాయల వ్యయంతో మూడింటిని (శ్రీవీరాంజనేయ స్వామి దేవస్థానం, రామాలయం, గంగానమ్మ గుడి) పునర్నిర్మాణం చేయటం అభివృద్ధిలో భాగం కాదా అని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు. కృష్ణా పుష్కరాల పేరుతో విజయవాడ నగరంలో దాదాపు 40 ఆలయాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేసి వాటిలోని దేవతా విగ్రహాలను చెత్త రవాణా చేసే ట్రాక్టర్లలో తరలించిన ఘన చరిత్ర చంద్రబాబు ప్రభుత్వానిదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు మనోభావాలు దెబ్బతినకుండా కూల్చేసిన ఆలయాలను పునర్నిర్మించి ప్రారంభించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని అంటున్నారు.

కళ్లున్న కబోదులు ప్రతిపక్ష నాయకులు



డివిజన్‌లో కోట్లాది రూపాయలతో రోడ్ల నిర్మాణం, కొండ ప్రాంతంలో గత ప్రభుత్వం పట్టించుకోని మెట్లు, డ్రెయిన్లు, రిటైనింగ్ వాల్స్ నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు జరిగాయి. ఇంత జరిగినా జరగలేదనే ప్రతిపక్ష నాయకులు కళ్లున్న కబోదుల్లాంటివారు. సీఎం జగనన్న, ప్రభుత్వంపై బురద చల్లటమే పనిగా పెట్టుకున్నారు. తమ ప్రభుత్వ పాలనలో ఏం అభివృద్ధి చేశామో టీడీపీ, జనసేన నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలి. విమర్శించే ప్రతిపక్ష నాయకులు వస్తే డివిజన్‌లో ఎన్ని అభివృద్ధి పనులు జరిగాయో దగ్గరుండి చూపిస్తా.

– గోదావరి గంగ, 47వ డివిజన్ కార్పొరేటర్


నూతనంగా నిర్మించిన ఏనుగుల లక్ష్మణరావు రోడ్


నూతనంగా నిర్మించిన వీరాంజనేయ స్వామి దేవస్థానం

క్లుప్తంగా

అబూబకర్ మసీదులో ఇఫ్తార్

వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ హాజరు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): శాంతి, సౌభ్రాతృత్వాల రంజాన్ మాసం మానవాళికి మంచి సందేశాన్ని అందిస్తోందని వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 43వ డివిజన్ ఉర్మిలా సుబ్బారావు నగర్‌లోని అబూబకర్ మసీదులో సోమవారం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. మసీదులో నమాజ్ చేశారు. ముస్లిం మత పెద్దలతో మాట్లాడారు. రంజాన్ సందేశాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ గౌస్ మొహిద్దీన్, స్థానిక కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి, షేక్ నాసర్, షేక్ రాయల్ బాబు, షేక్ బాజీ బాబా మసీదు పెద్దలు షేక్ అజీజ్ అహ్మద్, షేక్ అబ్దుల్ ఖాదర్, షేక్ మస్తాన్, అబ్దుల్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నవ వధువుకు అత్తింటి వేధింపులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నవ వధువుకు అత్తింటి వేధింపుల ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. లంబాడీపేట తోట లక్ష్మయ్య వీధికి చెందిన భావనకు ఆరు నెలల కిందట ఖమ్మం జిల్లాకు చెందిన దుంగ్రోత్ మోహన్‌కు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహ సమయంలో కట్నం, ఇతర లాంఛనాలు భారీగానే ఇచ్చారు. పెళ్లయి కాపురానికి వెళ్లినప్పటి నుంచి మోహన్ భార్య భావనను వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు అత్త, ఆడపడుచులకు చెప్పింది. నీవు తెచ్చిన కట్నం సరిపోలేదని చెప్పి భర్తతో పాటు అత్తింటి వారు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి చేరింది. పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

యనమలకుదురు ఆలయంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సహస్ర లింగార్చన, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాస భజన బృందం వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈఓ గంగాధరరావు, భక్తులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ సేవ చేయాలి



పెనమలూరు: ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సమాజ సేవ చేయాలని జేఎన్‌టీయూకే ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ శ్యామ్ తెలిపారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ఎన్ఎస్ఎస్ విభాగం తాడిగడపలో సోమవారం నుంచి 7 రోజుల పాటు నిర్వహించనున్న సేవా శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. వివిధ విభాగాల్లో చదువుతున్న ఇంజినీరింగ్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ద్వారా సమాజ సేవ చేయాలని సూచించారు. ఆడ పిల్లలకు చదువుపై ఉపయోగాలు, ప్రాథమిక విద్య పై అవగాహన, ఓటు హక్కు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, స్వచ్ఛభారత్, రోడ్ సేఫ్టీ, పౌష్టికాహారం వలన కలిగే ప్రయోజనాలు తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీన్ బావినేని పాండురంగారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, వి.వెంకటేశ్వరరావు, టి.వెంకటేశ్వరరావు, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సుందరవనం.. సింగ్‌నగర్ డంపింగ్‌యార్డు









ఒకప్పుడు చెత్తా చెదారం, ఇతర వ్యర్థాలతో అత్యంత అపరిశుభ్రంగా ఉండే సింగ్‌నగర్ డంపింగ్ యార్డు నేడు సుందరవనంగా మారింది. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. అందరికీ అవగాహన కలిగించే విధంగా వివిధ అంశాలపై చిత్రాల రూపంలో ప్రదర్శన ఏర్పాటుచేశారు. అద్భుతమైన మొక్కలు నాటి చుట్టూ గ్రీనరీ రూపుదిద్దారు. విజ్ఞాన వీచికగా మారిన డంపింగ్ యార్డు ఆకర్షణీయంగా ఉంది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







హక్కులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వైవీ రావు

పటమట(విజయవాడపశ్చిమ): వినియోగదారులు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటం అవసరమని, అప్పుడే సమస్యల నుంచి దూరంగా ఉంటారని వైవీ రావి అసోసియేట్స్ అధినేత వైవీ రావు అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కన్స్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై విద్యార్థులకు అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన వైవీ రావు మాట్లాడుతూ వినియోగదారుల చట్టం ప్రజలకు అనేక అంశాల్లో రక్షణ కల్పిస్తుందని తెలిపారు. దుకాణదారుల నుంచి మోసపోకుండా, నష్టపోకుండా అనేక చట్టాలు అండగా నిలుస్తాయన్నారు. వస్తు, సేవల కొనుగోలు క్రమంలో ఎదురయ్యే నష్టం లేదా ఇతర సమస్యల నుంచి వినియోగదారులకు అండగా ఉంటేందుకు ఈ చట్టాలు దోహదం చేస్తాయని పేర్కొన్నారు. అయితే వాటిపై విద్యార్థులకు ఇతర ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ అంశాల్లో అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమాన్ని క్లబ్ కన్వీనర్ విజయబాబు టొక్కం నిర్వహించగా కామర్స్ అండ్ మేనేజమెంట్ విభాగాధిపతి ఎన్ హేమంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో విస్తృతంగా సేవలు అందించాలి

జిల్లా లయన్స్‌క్లబ్ గవర్నర్ శంకర గుప్తా


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా గవర్నర్ శంకర్‌గుప్తా

ఆటోనగర్(విజయవాడతూర్పు): లయన్స్ క్లబ్ సేవలను గ్రామాల్లో విస్తృతంగా నిర్వహించాలని జిల్లా గవర్నర్ జెఎస్ శంకరగుప్తా అన్నారు. విజయవాడలోని ఓ కల్యాణ మండపంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శంకర గుప్తా మాట్లాడుతూ లయన్స్‌క్లబ్‌లోకి మహిళలనూ భాగస్వాములుగా చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి క్లబ్‌కు సంబంధించి నెలవారీ సమావేశాలు నిర్వహించి తద్వారా గ్రామాల్లో ప్రజలకు సేవలు చేసే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది విద్యార్థులు, మహిళలకు సైకిళ్లు, కుట్టు మిషన్‌లు పెద్ద ఎత్తున పంపిణీ చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మాజీ లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ శ్రీశాంతి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరి, లయన్స్ క్లబ్ ముఖ్య సలహాదారులు కత్తిక శివనాగేశ్వరరావు, అన్నె శివనాగేశ్వరరావు, విజయవాడ జవహర్ ఆటోనగర్, విజయవాడ ఆటోనగర్, ఆటోనగర్ జెమ్స్ లయన్స్ క్లబ్ సభ్యులు సుంకర దుర్గాప్రసాద్, డాక్టర్ అబ్దుల్ కలాం (కలాం బ్యాటరీ వరల్డ్స్), కాంతారావు, బెవర నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పేకాట శిబిరాలపై దాడి

ఇబ్రహీంపట్నం: మండలంలోని వివిధ గ్రామాల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరాలపై పోలీసులు ఆదివారం రాత్రి దాడులు చేశారు. ఈ దాడుల్లో 14 మందిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. ఇబ్రహీంపట్నం గాజులపేట సడక్‌రోడ్డులోని కాలనీలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.8,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. చిలుకూరులో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద లభించిన రూ.17,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐలు పాపారావు, బి.అనూష కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ ఎం.సత్యన్నారాయణ తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

మైలవరం: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో క్లబ్ డే వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మాట్లాడుతూ కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ అండ్ డేటా సైన్స్ విభాగం హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్ డాక్టర్ ఓ.రమాదేవి, డీన్ ఇండస్ట్రీ రిలేషన్స్ డాక్టర్ వి. సూర్యనారాయణ, డీన్ అకాడమిక్స్ డాక్టర్ శ్రీనివాసరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాలీ లారీ, ఆటో ఢీ : ముగ్గురికి గాయాలు

ఉంగుటూరు: చెన్నై – కోల్‌కతా జాతీయ రహదారిపై చిన్న అవుటపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు స్వల్ప గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆత్కూరుకు చెందిన రొక్కం వీరభద్రస్వామి తన ఆటోలో కుటుంబ సభ్యులతో కలసి గన్నవరం వెళ్లి ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. చిన్న అవుటపల్లిలో ఒక ట్రాలీ లారీ వెనుక నుంచి ఆటోను ఢీ కొనడంతో ఆటో పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికులు సమీపంలోని పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు.

ఆసిఫ్‌కు ఆర్యవైశ్యులు అండగా ఉండాలి

పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు


ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్యవైశ్య సామాజిక వర్గానికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి గౌరవించారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురంలోని ఓ ఫంక్షన్ హాలులో విజయవాడ అర్బన్ జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌కు మద్దతుగా నియోజకవర్గ స్థాయి ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ ఆసిఫ్‌ను పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు ప్రభుత్వ పాలనలో ఆర్యవైశ్యులను దారుణంగా అవమానించారని తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములును అగౌరవపరిచారని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత తమ సామాజిక వర్గానికి మంత్రి పదవిని కేటాయించడంతో పాటుగా పలువురు ఎమ్మెల్యేలుగా, చైర్మన్లుగా నియమించారని గుర్తు చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేందుకు ఆదేశాలు జారీ చేశారన్నారు. వాసవీ సంస్థలను దేవదాయ శాఖ నుంచి తప్పించారని గుర్తు చేశారు. అన్ని విధాల ఆర్యవైశ్యులకు జగనన్న అండగా నిలిచారన్నారు. స్థానికంగా ముస్లిం సామాజికవర్గం అధికంగా ఉండటం, రాష్ట్రంలో 175కు 175 సీట్లు సాధించాలనే లక్ష్యంతో వైఎస్ జగన్ సీట్లు సర్దుబాటు చేశారన్నారు. ఈ క్రమంలో పశ్చిమ నియోజకవర్గం ముస్లిం సామాజిక వర్గానికి చెందిన షేక్ ఆసిఫ్‌కు సీటు కేటాయించారని పేర్కొన్నారు. తనను సెంట్రల్ నియోజకవర్గానికి అభ్యర్థిగా ప్రకటించారన్నారు. నియోజకవర్గంలోని ఆర్యవైశ్యులంతా ఆసిఫ్ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పశ్చిమ నియోజకవర్గం నుంచి ఆసిఫ్‌ను అత్యధిక మెజార్టీతో ఆర్యవైశ్యులు గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆసిఫ్ మాట్లాడుతూ ఆర్యవైశ్యులు దాన గుణం కలవారని, ఆధ్యాత్మిక చింతనతో నిత్యం సామాజిక సేవలో నిమగ్నమయ్యే వారన్నారు. వెలంపల్లి శ్రీనివాసరావును ఆదరించినట్లుగానే తనకు అండగా ఉండాలని కోరారు. ఆర్యవైశ్యులకు తాను అండగా నిలబడతానన్నారు. మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పల్లపోతు మురళీకృష్ణ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్లు గుడివాడ నరేంద్ర, మండేపూడి ఛటర్జీ, సంఘం యువజన విభాగ నగర అధ్యక్షులు గుడిపాటి కిషోర్, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి రూ.50,460 విరాళాన్ని ఓ భక్తుడు అందజేసినట్లు ఆలయ చైర్మన్ భరద్వాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ఉప్పుటూరి శ్రీనివాస్ విరాళాన్ని అందించారన్నారు. ఆలయ అభివృద్ధికి భక్తులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు తిరునగరి రామకృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.